క్లుప్తంగా

ప్రజాదర్బార్‌కు 102 అర్జీలు

కొమరోలు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. మొత్తం 102 అర్జీలు వచ్చినట్లు ఎంపీడీఓ మస్తాన్‌వలి తెలిపారు. తాగునీటి సమస్య, భూసమస్యలపై ఎక్కువ సంఖ్యలో అర్జీలు వచ్చాయని ఎంపీడీఓ వివరించారు.

గిద్దలూరు ఎంఈఓ-2గా నాగభూషణ్‌రెడ్డి


నాగభూషణ్‌రెడ్డి

గిద్దలూరు రూరల్: గిద్దలూరు ఎంఈఓ-2గా పోలా నాగభూషణ్‌రెడ్డిని నియమించారు. ఎంఈఓ జింకా వెంకటేశ్వర్లు పదవీ విరమణ పొందడంతో ఆయన స్థానంలో జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తున్న నాగభూషణ్‌రెడ్డిని నియమిస్తూ పాఠశాల విద్య ఆర్జేడీ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఆయన బుధవారం బాధ్యతలు స్వీకరించారు. నూతన ఎంఈఓ-2కు పలువురు ఉపాధ్యాయులు అభినందనలు తెలియజేశారు.

గురుకుల ప్రవేశ పరీక్ష తేదీ మార్పు

అర్ధవీడు(బేస్తవారిపేట): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలల్లో ప్రవేశానికి నిర్వహించాల్సిన పరీక్ష తేదీ మారినట్లు అర్ధవీడు గురుకులం ప్రిన్సిపాల్ బి.బలరామిరెడ్డి తెలిపారు. ఏప్రిల్ 6వ తేదీన నిర్వహించాల్సిన పరీక్షను ప్రభుత్వం 13వ తేదీకి వాయిదా వేసిందని పేర్కొన్నారు. ఐదో తరగతిలో చేరేందుకు ప్రవేశ పరీక్ష ఉదయం 10 నుంచి 12 గంటల వరకు, ఇంటర్మీడియెట్ ప్రవేశానికి మధ్యాహ్నం 2 నుంచి 4.30 గంటల వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. మారిన పరీక్ష షెడ్యూల్‌ను విద్యార్థులు, తల్లిదండ్రులు గమనించాలని కోరారు.

ముగ్గురు విద్యార్థులు గైర్హాజరు

బేస్తవారిపేట: మండలంలో పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు సోమవారం ముగ్గురు విద్యార్థులు గైర్హాజరైనట్లు ఎంఈఓ సీహెచ్ రమణారెడ్డి తెలిపారు. సైన్స్ పరీక్షకు పిటికాయగుళ్ల జెడ్పీ హైస్కూల్లో 139 మందికిగాను ఇద్దరు, బేస్తవారిపేటలోని జెడ్పీ బాలుర హైస్కూల్లో 142 మందికిగాను ఒకరు గైర్హాజరయ్యారని, జెడ్పీ బాలికల హైస్కూల్లో 192 మందికిగాను అందరూ హాజరయ్యారని వివరించారు.

రంజాన్ తోఫా పంపిణీ

గిద్దలూరు రూరల్: రంజాన్ పండుగ సందర్భంగా 30 మంది పేద ముస్లింలకుగిద్దలూరు పట్టణానికి చెందిన ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి షేక్.ఖాజాహుస్సేన్ నిత్యావసర వస్తువులను బుధవారం ఆయన నివాసంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రంజాన్ పర్వదినాన్ని అందరూ సంతోషంగా నిర్వహించుకోవాలన్న ఉద్దేశంతో రంజాన్ తోఫా పంపిణీ చేస్తున్నామన్నారు.

మట్కా నిర్వాహకులకు కౌన్సెలింగ్


మట్కా నిర్వాహకులకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ సురేష్

గిద్దలూరు రూరల్: పట్టణంలోని మట్కా నిర్వాహకులకు సీఐ కె.సురేష్ బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో కౌన్సెలింగ్ ఇచ్చారు. మట్కా నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పేద ప్రజలను ఆర్థికంగా నాశనం చేసే మట్కాను వదిలేయాలని హితవు పలికారు. అమాయక ప్రజల ఆశలను ఆసరాగా తీసుకుని మట్కా వ్యాపారం చేయడం చట్టరీత్యా నేరమన్నారు. మట్కా నియంత్రణలో పోలీసులకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.

భవిత కేంద్రానికి ఫ్యాన్ అందజేత


దాతలతో ఎంఈఓ శ్రీనివాసరెడ్డి

పొదిలి: స్థానిక భవిత కేంద్రానికి ఎస్‌కే రఫీ, ఎస్‌కె.సలీమా దంపతులు తమ కుమారుడు మహ్మద్ రుహాన్ జన్మదినం సందర్భంగా ఎంఈఓ శ్రీనివాసరెడ్డి చేతులమీదుగా ఫ్యాన్ అందజేశారు. పిల్లలకు నోటు పుస్తకాలు, స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయిని షాహిదా, రమాదేవి, సీఆర్‌ఎంటీలు జి.సుబ్బారెడ్డి, కిరణ్మయి, ఆచారి, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నీలకంఠాయా.. నీ భూమి స్వాహా!

తర్లుపాడు:

వెళ్తే.. తర్లుపాడులోని ప్రఖ్యాత నీలకంఠేశ్వర స్వామి


తర్లుపాడులోని నీలకంఠేశ్వరస్వామి దేవస్థానం


దేవాలయ భూమిలో ఏర్పాటుచేసిన గోకులం షెడ్

- తర్లుపాడులో నీలకంఠేశ్వరస్వామి ఆయన భూమి కబ్జా
- గోకులం షెడ్ నిర్మించుకున్న ఓ టీడీపీ కార్యకర్త
- అక్రమానికి అన్ని విధాలా సహకరించిన అధికారులు

తర్లుపాడు:

అధికారమే అండగా కొందరు తెలుగు తమ్ముళ్లు అక్రమాలకు తెగబడుతూనే ఉన్నారు. ఖాళీ భూమి కనబడితే చాలు దర్జాగా కబ్జా చేస్తున్నారు. ఇప్పటి వరకు పశువుల బీళ్లు, ప్రభుత్వ పోరంబోకు స్థలాలను కాజేసి అడ్డంగా దొరికిపోయిన టీడీపీ నాయకులు.. ఇప్పుడు ఆలయాల భూములపై కన్నేశారు. ఇందుకు అధికారులు కూడా సహకరించడం గమనార్హం. వివరాల్లోకి వారికి భక్తుల ద్వారా బహుమానంగా 6.92 ఎకరాల భూమి సంక్రమించింది. ఆ భూమిలో కొంతభాగాన్ని ఇప్పటికే కొందరు ఆక్రమించుకోగా తాజాగా ఓ తెలుగు తమ్ముడు ఏకంగా ఎకరా భూమిని కబ్జా చేశాడు. అందులో ఐదు సెంట్ల స్థలంలో గోకులం షెడ్ నిర్మించాడు. ఇందుకు అధికారులు పొజిషన్ సర్టిఫికెట్, పన్ను రసీదు అందజేసి స్వామిభక్తిని చాటుకున్నారు. నీలకంఠేశ్వరస్వామి దేవాలయాన్ని ఆనుకుని ఉన్న సర్వే నంబర్ 311/2లో 2.36 ఎకరాల బండిదారి భూమిని కూడా టీడీపీ నేతలు ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారు.


ఆక్రమణకు గురైన దేవస్థాన భూమి

ఆలయ భూమి సర్వే నంబర్‌పై గ్రామ కంఠం రిజిస్ట్రేషన్

తర్లుపాడులో సర్వే నంబరు 361/1లో 48 ఎకరాల గ్రామకంఠం భూమి ఉంది. సదరు భూమిలో గ్రామంలోని ప్రజలు తరతరాలుగా ఇళ్లు నిర్మించుకుని జీవిస్తున్నారు. అయితే సదరు గ్రామ కంఠం భూములపై గతంలో నిషేధం ఉండటంతో నీలకంఠేశ్వరస్వామి భూమి ఉన్న సర్వే నంబర్ 362/2 పై అధికారులు రిజిస్ట్రేషన్ చేశారు. ఇప్పటికైనా దేవదాయ శాఖ, రెవెన్యూ అధికారులు స్పందించి ఆలయ భూమిని అక్రమార్కుల బారి నుంచి కాపాడాలని భక్తులు కోరుతున్నారు.

నీటి ఎద్దడి తీవ్రం.. మురుగు సమస్య దారుణం



నినాదాలు చేస్తున్న సీపీఎం సభ్యులు

- పొదిలిలో తాగునీరు, డ్రైనేజీ సమస్యలు పరిష్కరించాలి
- ధర్నాలో సీపీఎం నాయకుల డిమాండ్

పొదిలి: నగర పంచాయతీ పరిధిలో తాగునీరు, డ్రైనేజీ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.రమేష్ డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారంలో జాప్యాన్ని నిరసిస్తూ బుధవారం స్థానిక నగర పంచాయతీ కార్యాలయం వద్ద సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ.. వేసవి ప్రారంభమైనందున ట్యాంకర్లతో నీరు సరఫరా చేసి నీటి ఎద్దడిని నివారించాలన్నారు. బోర్లకు యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేశారు. సాగర్ నీటితో పెద్ద చెరువును నింపే పనులను వెంటనే ప్రారంభించాలన్నారు. సైడు కాలువలు శిథిలావస్థకు చేరడం, పలు చోట్ల కాలువలు లేక పోవడంతో మురుగునీరు రోడ్లపైకి చేరుతోందన్నారు. డ్రెయినేజీలను ఎప్పటికప్పుడు శుభ్రం చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరాను నిలిపివేయడంతో డ్రమ్ము రూ.30 పెట్టి కొనుగోలు చేసుకోవాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఐదుగురు సభ్యులు ఉండే కుటుంబం ఒక రోజుకు నీటి కోసం రూ.100 ఖర్చు చేయాల్సి వస్తోందని పేర్కొన్నారు. నేతపాలెంలో మురుగు సమస్య పరిష్కారం కోసం ప్రత్యేక చర్యలు చేపట్టడంపై మున్సిపల్ అధికారులు దృష్టి సారించాలన్నారు. అనంతరం నగర పంచాయతీ కమిషనర్ శ్రీనివాసులకు సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ప్రాంతీయ కమిటీ కన్వీనర్ పి.బాలనరసయ్య, నాయకులు జి.నరసింహారావు, ఆర్.తిరుపతయ్య, ఎ.శ్రీనివాసులు, ఏ.బాదుల్లా, వి.అనిత, వడ్డే ఆనంద్, నరేంద్ర, రమణ,పి.దినేష్, రమ, అంజమ్మ, మల్లీశ్వరి, చంద్ర, సాంబ, రాజు, భార్గవ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు బాగుచేయాలని కమిషనర్‌కు వినతి


కమిషనర్‌కు అర్జీ అందజేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

గిద్దలూరు రూరల్: నగర పంచాయతీ పరిధిలోని పాములపల్లె రోడ్డును బాగు చేయాలని కోరుతూ సీఐటీయూ, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో బుధవారం నగర పంచాయతీ కమిషనర్ ఐ.శ్రీనివాసులుకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకుడు బి.నరసింహులు మాట్లాడుతూ గత 15 ఏళ్ల క్రితం వేసిన రోడ్డు పూర్తిగా ధ్వంసమై అధ్వానంగా తయారైందన్నారు. కంకర రాళ్లు లేచి ఉన్న రోడ్డులో ప్రయాణం కష్టతరంగా మారిందని, రోజూ గ్రామస్తులు ఇబ్బంది పడుతూ గ్రామానికి చేరుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. రోడ్డును త్వరగా బాగు చేయాలని కమిషనర్‌కు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల సభ్యులు భాస్కర్, సుబ్బారెడ్డి, మార్కు, లక్ష్మీనారాయణ, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలి

మార్కాపురం: మండలంలో ఏర్పాటు చేసిన కందులు, శనగల కొనుగోలు కేంద్రాలను రైతులు వినియోగించుకోవాలని మార్కాపురం వ్యవసాయశాఖ ఏడీ బాలాజీ నాయక్ సూచించారు. బుధవారం పెద్దయాచవరం పెద్దనాగులవరం గ్రామంలో రైతులకు నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో క్వింటా కందులకు రూ.7550, శనగలకు రూ.5650 మద్దతు ధర ఇస్తున్నట్లు తెలిపారు. రైతులు సేంద్రియ పద్ధతిలో ఆకు కూరలు, కూరగాయలు సాగు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏఓ దేవిరెడ్డి శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

తర్లుపాడు: మండలంలోని రైతులు కందుల కొనుగోలు కేంద్రాన్ని వినియోగించుకోవాలని ఏఓ వెంకటేశ్వర్లు సూచించారు. రైతులు పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్ కార్డు జిరాక్స్ కాపీలు అందించి కందులను అమ్ముకోవచ్చని ఏఓ తెలిపారు.


మాట్లాడుతున్న ఏడీఏ బాలాజీ నాయక్

ఉప్పలపాడులో కొనుగోలు కేంద్రం ప్రారంభం

పొదిలి రూరల్: పొదిలి మండలంలోని ఉప్పలపాడు రైతు సేవా కేంద్రంలో కందుల కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ప్రారంభించారు. ముందుగా అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి జైనులాబ్దిన్ మాట్లాడుతూ ఉప్పలపాడు సోసైటీ పరిధిలో ఉన్న ఉప్పలపాడు, ఏలూరు, గోగినేనివారిపాలెం, తలమళ్ల గ్రామానికి చెందిన రైతులు శనగలు, కందులను ప్రభుత్వం నిర్దేశించిన ప్రమాణాలతో కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలన్నారు. కేంద్రాల వద్ద దళారులు చెప్పే మాటలను నమ్మి మోసపోవద్దని సూచించారు. సర్పంచ్ ఏసోబు, సొసైటీ మేనేజర్ సూర్య నారాయణ, సీఈఓ అంబటి ఓబుల్‌రెడ్డి, మహేష్, రైతులు పాల్గొన్నారు.


కందుల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అధికారులు

భూసార పరీక్ష ఆధారంగా ఎరువులు వాడాలి


మాట్లాడుతున్న ఏడీఏ బాలాజీనాయక్

బేస్తవారిపేట: రైతులు తమ పొలాల్లో భూసార పరీక్షలు చేయించుకునేందుకు రైతు సేవా కేంద్రాల్లో సంప్రదించాలని వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు డి.బాలాజీనాయక్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని నేకునాంబాద్, చింతలపాలెంలో రైతులకు భూసార పరీక్షలపై అవగాహన కల్పించారు. భూసార పరీక్షల ఫలితాలను బట్టి ఎరువులు వినియోగిస్తే పెట్టుబడి భారం తగ్గుతుందన్నారు. ఈ నెల 31వ తేదీలోగా ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి జక్కం మెర్సీ, ఏఈఓ ఆది గణేష్, వీఏఏ సత్యనారాయణ పాల్గొన్నారు.

అభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చేయండి

కొనకనమిట్ల: గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళికలు త్వరగా రూపొందించాలని జిల్లా పంచాయతీ అధికారి గొట్టిపాటి వెంకటనాయుడు ఆదేశించారు. బుధవారం ఆయన స్థానిక మండల పరిషత్ కార్యాలయాన్ని తనిఖీ చేసి అధికారులతో సమావేశమయ్యారు. తొలుత కార్యాలయం రికార్డులు పరిశీలించారు. హౌస్‌హోల్డ్ సర్వే తీరు గురించి తెలుసుకున్నారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న పలు రకాల సర్వేలను త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ ఈశ్వరమ్మకు సూచించారు. ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన పెదారికట్ల పంచాయతీ కార్యదర్శి పి.ప్రసాద్ పని ఒత్తిడితో మానసికంగా ఇబ్బంది పడ్డారని ఆయన కుటుంబ సభ్యులు వివరించినట్లు పలువురు కార్యదర్శులు డీపీఓ దృష్టికి తెచ్చినట్లు సమాచారం. తనిఖీ సమయంలో ఈఓఆర్డీ శ్రీదేవి, మండల అధికారులు ఉన్నారు.


మాట్లాడుతున్న జిల్లా పంచాయతీ అధికారి వెంకటనాయుడు

పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన డీఎస్పీ


పాత వాహనాలు పరిశీలిస్తున్న డీఎస్పీ

పొదిలి: స్థానిక పోలీస్ స్టేషన్‌ను బుధవారం దర్శి డీఎస్పీ బి.లక్ష్మీ నారాయణ తనిఖీ చేశారు. స్టేషన్‌లో రికార్డులు పరిశీలించి, పెండింగ్ కేసుల పరిష్కారంపై పలు సూచనలిచ్చారు. స్టేషన్‌లోని వివిధ విభాగాలను పరిశీలించి మార్పులు చేర్పులపై సలహాలిచ్చారు. మహిళా సహాయక కేంద్రంలోని రికార్డులు తనిఖీ చేశారు. డీఎస్పీ వెంట సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సైలు వేమన, బ్రహ్మానాయుడు, ఇతర సిబ్బంది ఉన్నారు.

చిన్నారులకు ఆటపాటలతో విద్యనందించాలి

తర్లుపాడు: చిన్నారులు మానసికంగా అభివృద్ధి చెంది, విద్యను సరళంగా అర్థం చేసుకునేందుకు ఆటపాటలు ముఖ్యపాత్ర పోషిస్తాయని సీడీపీఓ బి.సుశీలాదేవి పేర్కొన్నారు. మూడో రోజు బుధవారం పోషణ్ భీ.. పడాయి భీ శిక్షణలో ఆమె మాట్లాడారు. మార్కాపురం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలకు తర్లుపాడు మండలంలోని కలుజువ్వలపాడు జెడ్పీ హైస్కూల్లో శిక్షణ ఇస్తున్నారు. సీడీపీఓ మాట్లాడుతూ.. చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్యనందించడంతోపాటు పౌష్టికాహారం సక్రమంగా పంపిణీ చేయాలని సూచించారు. దివ్యాంగ చిన్నారుల సంరక్షణపై పలు సూచనలిచ్చారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సీడీపీఓ సుశీలాదేవి

ముస్తాబైన మసీదులు


విద్యుత్ దీపాలతో అలంకరించిన పెద్దమసీదు

గిద్దలూరు రూరల్: రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని పట్టణంలోని మసీదులను బుధవారం విద్యుత్ దీపాలతో అలంకరించి ముస్తాబు చేశారు. స్థానిక రైల్వేస్టేషన్ రోడ్డులోని పెద్ద మసీదు, గాంధీబొమ్మ సెంటర్‌లోని చిన్నమసీదు, నల్లబండబజారులోని మసీదు, రాచర్ల రోడ్డులోని మసీదులను విద్యుత్ దీపాలతో అలంకరించారు. అలాగే ఈద్గాలను కూడా ప్రత్యేక ప్రార్థనల కోసం సిద్ధం చేస్తున్నారు.

శ్రీవారి పల్లకి మోయడం అదృష్టం


చివరి రోజు చక్రస్నానం చేసి పూజలో పాల్గొన్న మోతకాపులు(ఫైల్)

కొనకనమిట్ల: ఏటా వైభవంగా నిర్వహించే వెలుగొండ వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో 13 రోజులపాటు స్వామివారి పల్లకిని మోసి మోతకాపులు తమ భక్తిని చాటుకున్నారు. తర్లుపాడు మండలం గంఢ్లోపల్లి గ్రామానికి చెందిన యాదవ కులస్తులు ఏటా బ్రహ్మోత్సవాల్లో శ్రీవారి పల్లకిని మోయడం ఆనవాయితీగా వస్తోంది. నిత్యం ఆలయం వద్ద ఉంటూ రోజూ నిర్వహించే కార్యక్రమాల్లో పాల్గొనడాన్ని మోతకాపులు తమ అదృష్టంగా భావిస్తున్నారు. పూర్వం నుంచి ఇప్పటి వరకు గంఢ్లోపల్లికి చెందిన 16 కుటుంబాల వారు ఎటువంటి లాభాపేక్ష లేకుండా శ్రీవారి ఉత్సవాల్లో కీలక పాత్ర పోషిస్తూ వస్తున్నారు.

గుండెపోటుతో ఏఎన్‌ఎం మృతి

రాచర్ల: మండలంలోని అనుమలవీడు పీహెచ్‌సీలో ఏఎన్‌ఎంగా విధులు నిర్వహిస్తున్న శ్రీరాములమ్మ(39) బుధవారం సాయంత్రం గుండెపోటుతో మృతి చెందారు. వివరాలు.. గిద్దలూరు పట్టణానికి చెందిన నల్లబోయిన శ్రీరాములమ్మ (శ్రీవల్లి) రాచర్ల మండలంలోని యడవల్లి సచివాలయంలో ఏఎన్‌ఎంగా పనిచేస్తూ పదోన్నతిపై అనుమలవీడు పీహెచ్‌సీలో వారం రోజుల క్రితమే విధుల్లో చేరారు. బుధవారం విధులు ముగించుకుని ఇంటికి వెళ్తున్న సమయంలో కళ్లు తిరిగి కిందపడిపోయారు. స్థానికులు గమనించి గిద్దలూరులోని ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. వైద్య పరీక్షలు చేస్తున్న క్రమంలో గుండెపోటుతో మృతి చెందారు. ఆమెకు ఇద్దరు కుమారులు ఉన్నారు.

పాస్టర్ ప్రవీణ్ మృతిపై విచారణ చేయాలి


కొవ్వొత్తుల ప్రదర్శనతో నివాళులర్పిస్తున్న ఫాదర్ గుర్రం జాన్ రంగయ్య

బేస్తవారపేట: పాస్టర్ ప్రవీణ్ పగడాల మరణం క్రైస్తవ వర్గానికి తీరని లోటని, ఆయన మృతిపై పలు అనుమానాలు ఉన్నాయని, పోలీసులు విచారణ చేయాలని బిలీవర్స్ ఈస్ట్రన్ చర్చ్ ఫాదర్ గుర్రం జాన్ రంగయ్య పేర్కొన్నారు. బుధవారం ఆయన ఆధ్వర్యంలో చర్చ్ వద్ద కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించి, పాస్టర్ మృతికి నివాళులర్పించారు. కార్యక్రమంలో పాస్టర్ చిట్టిబాబు, పోలుబాబు, డి.చిట్టిబాబు ప్రశాంతి పాల్గొన్నారు

పోలీస్ స్టేషన్‌కు 100 సీసీ కెమెరాలు బహూకరణ

గిద్దలూరు రూరల్: గిద్దలూరు పోలీసుస్టేషన్ పరిధిలో నేరాలు నియంత్రించేందుకు పలువురు దాతలు బుధవారం సీఐ కె.సురేష్‌కు 100 సీసీ కెమెరాలు అందజేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. ఎస్పీ దామోదర్ సూచన మేరకు ప్రజల సహకారంతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. గిద్దలూరు పోలీసు స్టేషన్ పరిధిలో గుర్తించిన కీలక ప్రదేశాల్లో కెమెరాలు ఏర్పాటు చేస్తామన్నారు. ఈ సందర్భంగా దాతలు నంది శ్రీను, కడియం సహా పలువురిని సీఐ ప్రత్యేకంగా అభినందించారు.